


నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

మంగళవారం 24 జూన్ 2025 పేజీలు 06

ఆదిలాబాద్

మంచిర్యాల

నిర్మల్ - కొమరం భీం

ఆసిఫాబాద్




## ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

### - జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల ప్రతినిధి,సూర్య మేజర్ న్యూస్ :** ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను సంబంధిత అధికారులు సమన్వయంతో కృషి చేసి త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో మంచిర్యాల, బెల్లంపల్లి రాజస్వ మండల అధికారులు శ్రీనివాస్ రావు, హరికృష్ణలతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. బెల్లంపల్లి మండలం చాలేపల్లి గ్రామానికి చెందిన గోమాన బింగమ్మ, గోమాస భాగ్యలక్ష్మి. గోమాస ధనలక్ష్మి, దుర్గం సౌందర్య తమకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ వేరువేరుగా దరఖాస్తులు అందజేశారు. భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య ప్రతినిధులు తమ దరఖాస్తులో ప్రభుత్వం చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకంలో ఎలాంటి షరతులు లేకుండా లబ్దిదారులకు నిధులు మంజూరు చేయాలని, బడ్జెట్లో ఈ పథకం కొరకు నిధులు పెంచాలని, రాజకీయ ప్రమేయం లేకుండా అర్హులందరికీ పథకం వర్తింపచేయాలని కోరారు.

మిగితా..2లో

## ప్రజావాణి దరఖాస్తు క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించాలి



### - జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే

**ఆసిఫాబాద్ ప్రతినిధి,సూర్య మేజర్ న్యూస్ :** ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, ఎం. డేవిడ్, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు లతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. కాకజ్ నగర్ మున్సిపాలిటీకి చెందిన అభింబి తనకు 4 సంవత్సరాలుగా పింఛన్ రావడం లేదని, పునరుద్ధరించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. పెంచికల్ పేట మండలం చెడ్వాయి గ్రామానికి చెందిన బోయిరే బావాజీ గత నెలల క్రితం తన కుమారుడికి, మనుమడికి పట్టా ఇచ్చినప్పటికీ తమ పోషణ పట్టించుకోవడం లేదని, వారి నుండి భూమిని తిరిగి ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఆసిఫాబాద్ పట్టణం శివకేశవ మందిరం ప్రాంతానికి చెందిన వైరగడె లక్ష్మి తనకు సంబంధించిన 2 ఎకరాల వ్యవసాయ భూమికి రైతు భరోసా ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. పెంచికలపేట మండలం ఎల్లూరు గ్రామానికి చెందిన కొప్పుల రోహిత్ తమ గ్రామంలో మీ- సేవా కేంద్రం ఏర్పాటు చేసి ఉపాధి కల్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. బెజ్జూర్ మండలం ముంజంపల్లి గ్రామానికి చెందిన నికోడే లక్ష్మీబాయి గ్రామ శివారులో తనకు గల పట్టా భూమికి సంబంధించి పట్టా పాసుపుస్తకాలు జారీ చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. రెబ్బెన మండలం నంబాల గ్రామానికి చెందిన అంగాల సాంబయ్య తనకు పులికుంట గ్రామ శివారులో గల పట్టాభూమిని నిషేధిత జాబితా నుండి తొలగించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఆసిఫాబాద్ మండలం గోవిందపూర్ గ్రామస్తులు తమకు కేటాయించిన ఇందిరమ్మ ఇండ్ల కొరకు చేపట్టిన నిర్మాణ పనులకు దేవాదాయ శాఖ వారు అడ్డుపడుతున్నారని, తగు చర్యలు తీసుకొని న్యాయం చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు.

## నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాలను విజయవంతం చేయాలి

### - జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**ఆదిలాబాద్ ప్రతినిధి సూర్య మేజర్ న్యూస్ :** మిషన్ పరివర్తన నిషా ముక్త్ భారత్ అభియాన్ ను జిల్లా లో విజయవంతం చేయాలనీ జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ట్రైనీ కలెక్టర్ సోనాలి చాబ్రలతో కలిసి నషా ముక్త్ భారత్ అభియాన్ పై సమావేశం నిర్వహించారు. అనంతరం అభియాన్ పోస్టర్లను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాల నిర్మూలనలో భాగంగా జిల్లాలో ఈ నెల 20వ తేదీ నుంచి 26 వరకు నిర్వహిస్తున్న నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాలను విజయవంతం చేయాలని సూచించారు. ఈ నెల 26న అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నివారణ దినోత్సవం సందర్భంగా నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మహిళలు,పిల్లలు, వికలాంగులు, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో వారం రోజుల పాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో వారం రోజుల పాటు చేపట్టే కార్యక్రమాల విజయవంతానికి చేపట్టాల్సిన చర్యల గురించి కలెక్టర్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. అధికారులు సమన్వయంతో పని చేస్తూ జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. డ్రగ్స్ మూలాలను గుర్తించి,వాటి రవాణా,విక్రయాలు,వినియోగం జరుగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాల గురించి ఉన్నత పాఠశాలలు, కళాశాలలు, వసతి గృహాల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి, ఎవరు కూడా పెడదోవ పట్టకుండా భావి పౌరుల భవిష్యత్తును కాపాడాలని హితవు పలికారు. ముఖ్యంగా యువత మత్తుపదార్థాల బారిన పడకుండా అందుబాటులో ఉన్న అన్ని వనరులను వినియోగిస్తూ అంకితభావంతో కృషి చేయాలన్నారు.



( మిగితా...2లో )

## ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

**నిర్మల్,సూర్య మేజర్ న్యూస్ :** ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వయంగా స్వీకరించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి దరఖాస్తును పరిశీలించి తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. అలాగే వానకాలం నేపథ్యంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో శానిటేషన్ చర్యల అమలులో ఎటువంటి నిర్లక్ష్యం జరగకూడదన్నారు. వనమహోత్సవంలో భాగంగా శాఖల వారీగా లక్ష్యం మేరకు మొక్కలు నాటాలని, అందుకు అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేయాలనీ సూచించారు. జిల్లాలో మంజూరైన ఇందిరమ్మ ఇండ్లను అర్హులని లబ్దిదారులకు అందేలా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజల సమస్యలను సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించేలా పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఆర్డీవో రత్న కళ్యాణి, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## రైతుల పంట పెట్టుబడి సహాయానికి బాసటగా రైతు భరోసా పథకం

### - జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**నిర్మల్,సూర్య మేజర్ న్యూస్ :** వర్షాకాలం సీజన్ ను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రైతు భరోసా పథకం కింద రైతులకు నిధులు అందజేస్తోందని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. రైతు భరోసా నిధుల జమ ప్రక్రియ దాదాపు పూర్తి కావస్తుందని అన్నారు.సోమవారం నాటికి నిర్మల్ జిల్లాలో మొత్తం రూ.260.80 కోట్ల రైతు భరోసా నిధులు విజయవంతంగా రైతుల ఖాతాల్లో జమ అయ్యాయన్నారు. జిల్లాలో ఉన్న మొత్తం 1,86,400 మంది రైతుల్లో 1,85,116 మంది ఖాతాల్లోకి డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్ఫర్ (డిబిటి) ద్వారా నిధులు చేరాయని వివరించారు. మిగిలిన అతి కొద్దిమంది రైతులకు త్వరలోనే నిధులు జమ కానున్నట్లు తెలిపారు. రైతులకు ఆర్థిక భరోసా కల్పించడంతో పాటు, వ్యవసాయ ఉత్పాదకతను పెంచడం ఈ పథకం లక్ష్యమని పేర్కొన్నారు. పెట్టుబడి భారం తగ్గడం వల్ల రైతులకు ఎంతో మేలు కలుగుతుందని పేర్కొన్నారు. చివరి గుంట భూమి వరకు రైతులకు రైతు భరోసా అందించడమే ప్రభుత్వ ధ్యేయం అని కలెక్టర్ స్పష్టంచేశారు. పంట పనుల ప్రారంభానికి ముందే నిధులు జమ కావడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారని కలెక్టర్ తెలిపారు.



## నైపుణ్య అభివృద్ధికి డ్యూటీ మీట్ లు దోహదపడతాయి

### - జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

**ఆదిలాబాద్, జూన్ 23సూర్య మేజర్ న్యూస్ :** రాష్ట్రంలో రెండవసారి నిర్వహిస్తున్న పోలీసు డ్యూటీ మీట్ లను జిల్లా స్థాయి డ్యూటీ మీట్ను ఆదిలాబాద్ జిల్లా పోలీసు హెడ్ క్వార్టర్స్లో సోమవారం జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించరు. సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా స్థాయిలో పోలీసు అధికారులు, పోలీసు సిబ్బంది పనితనాన్ని మెరుగుపరిచేందుకు, పెంపొందించేందుకు ఈ డ్యూటీ మీట్ దోహదపడుతుందని అన్నారు.తెలిపారు. డ్యూటీ మీట్ లను సద్వినియోగం చేసుకొని రాష్ట్రస్థాయి మరియు జాతీయస్థాయి డ్యూటీ మీట్ లలో ఉత్తమ ప్రతిభ కనబరిచి అవార్డులను కైవసం చేసుకునే విధంగా కష్టపడి తమ ప్రతిభను కనబరచాలని సూచించారు.

( మిగితా...2లో )



# ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి – జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



మొదటి పేజీ తరువాయి... లక్షెట్టిపేట మండలం పాతకొమ్ముగూడెం గ్రామానికి చెందిన శంకరి సత్యం తనకు ఇంటి స్థలం ఉందని, ఇందిరమ్మ ఇండ్ల పథకం వర్తింపచేసి ఆర్థిక సహాయం అందించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. జైపూర్ మండలం కిష్టాపూర్ గ్రామం ఎస్.సి. కాలనీవాసులు తమ ప్రాంతంలో ఒక అండర్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మందమర్రి మండల కేంద్రానికి చెందిన చిత్తారి కిరణ్ కుమార్ హాజీపూర్ మండలం గుడిపేటలో గల కేంద్రీయ విద్యాలయం విద్యార్థుల సౌకర్యార్థం క్యాతనపల్లి వరకు నడుస్తున్న ఆర్.టి.సి. బస్సును మందమర్రి వరకు నడిపించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మందమర్రి మండల కేంద్రానికి చెందిన గంగవరపు శ్రీహరి తాను కోటపల్లి మండలంలోని లింగన్నపేట, రాజారాం గ్రామాలలో మహిళ భవనములను నిర్మించాలని, సంబంధిత బిల్లులు ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. మందమర్రి మండల కేంద్రానికి చెందిన అంకం సాగర్ సివిల్ కాంట్రాక్టర్ అయిన తాను హాజీపూర్ మండలం రాపల్లి గ్రామంలో స్లాబ్ కల్వర్టు పని పూర్తి చేశానని, బిల్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. నస్పూర్ మండల కేంద్రానికి చెందిన పిట్ట సుశీల ఒంటరి మహిళ అయిన తనకు ఉపాధి కల్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. మంచిర్యాల పట్టణం కమ్మరివాడకు చెందిన సుబ్రహ్మణ్యం తాను 3 సంవత్సరాలుగా పక్షవాతంతో బాధపడుతున్నాను అన్ని తనకు దివ్యాంగ పింఛన్ మంజూరు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. జైపూర్ మండలం టేకుమట్ల గ్రామానికి చెందిన దేవి లక్ష్మి నిరుపేద అయిన తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో 49 దరఖాస్తులు అందాలని, ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ జరిపి సంబంధిత అధికారుల సమన్వయంతో త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### ప్రజావాణి దరఖాస్తు క్షేత్రస్థాయిలో పరిశీలించి

# త్వరగా పరిష్కరించాలి

### - జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే

మొదటి పేజీ తరువాయి... రెబ్బెన మండలం గంగాపూర్ గ్రామానికి చెందిన దుర్గం రుకుంబాయి తన భర్త పేరిట గల భూమిని తన కుమారుడు తన పేరిట పట్టా మార్చుకున్నాడని, ఇప్పుడు తన పోషణ పట్టించుకోవడం, ఈ విషయంపై తను చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను సంబంధిత శాఖ అధికారులు సమన్వయంతో కృషిచేసి త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. దరఖాస్తులను పెండింగ్ లో ఉంచకూడదని, దరఖాస్తుల పరిష్కారం వివరాలను సంబంధిత దరఖాస్తుదారులకు తెలియజేయాలని తెలిపారు. జిల్లాలో వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఆయా శాఖలకు కేటాయించిన లక్ష్యాలను 100 శాతం పూర్తి చేయాలని తెలిపారు. జిల్లాకు 51 లక్షల మొక్కలు నాటడం కొరకు లక్ష్యాన్ని నిర్దేశించడం జరిగిందని, ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున మొక్కలు నాటేందుకు అనువైన సమయం చూసి మొక్కలు నాటాలని తెలిపారు. గ్రామపంచాయతీలు, అటవీ శాఖల నుండి మొక్కలు తీసుకొని అవసరమైన చోట, ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో, ఖాళీ స్థలాలలో మొక్కలు నాటి సంరక్షించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, అర్జీదారులు పాల్గొన్నారు.

### నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాలను

# విజయవంతం చేయాలి

### - జిల్లా కలెక్టర్ రాజర్షి షా

మొదటి పేజీ తరువాయి... విద్యా సంస్థల్లో మాదకద్రవ్యాల నిరోధక కమిటీలను బలోపేతం చేసి అవి క్రియాశీలకంగా పని చేసేలా చూడాలన్నారు. రానున్న రోజుల్లో మాదక ద్రవ్యాల నియంత్రణకు మరిన్ని కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. పాఠశాలలు, కళాశాల వద్ద స్థానికంగా ఉండే దుకాణాలపై నిఘా ఉంచాలని సూచించారు. మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను తెలిపే సందేశాత్మక వీడియోను అన్ని స్కూళ్ళు, కాలేజీలలో ప్రదర్శించాలని, సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం చేస్తూ ప్రజలను జాగృతం చేయాలన్నారు. ఈ నెల 25 మాదకద్రవ్యాల నియంత్రణ అంశం పై పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించాలని అన్నారు. మాదకద్రవ్యాలకు అలవాటుపడిన వారిని గుర్తించి, ఆ వ్యసనం బారి నుండి బయటపడేలా వారిని డీఅడిక్షన్ కేంద్రాలలో చేర్పించి తగిన చికిత్స జరిపిస్తూ కౌన్సిలింగ్ ఇప్పించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా మాదక ద్రవ్యాల నిర్మూలన కోసం రూపొందించిన పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ట్రైనీ కలెక్టర్ సోనాలి,డి డబ్ల్యు ఓ జిల్లా సంబంధిత అధికారులు,డవ్ సెంటర్ పర్యవేక్షకుడు దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

### క్రీడలతో చదువులో ఏకాగ్రత పెంపొందుతుంది

### - జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల,సూర్య మేజర్ న్యూస్ :** క్రీడలతో విద్యార్థులలో చదువుపై ఏకాగ్రత పెంపొందుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ఒలంపిక్ డే రన్-2025 కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలోని ఐ.బి. చౌరస్తా నుండి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మైదానం వరకు నిర్వహించిన ర్యాలీలో జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి హన్మంతరెడ్డి, ఎ.సి.పి. ప్రకాష్, షెడ్యూల్డ్ కులముల సహకార సంస్థ ఈ.డి. దుర్గాప్రసాద్ లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలలో రాణించాలని, క్రీడలతో చదువుపై ఏకాగ్రత పెంపొందుతుందని తెలిపారు. ప్రతి రోజు కొంత సమయం వ్యాయామం, క్రీడలకు కేటాయించుకోవాలని, తద్వారా శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంటారని తెలిపారు. క్రీడలతో నాయకత్వ లక్షణాలు అలవడుతాయని, స్నేహభావం పెరుగుతుందని, గెలుపు-ఓటములను సమానంగా తీసుకొనే నిబద్ధత కలుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సి.ఐ. ప్రమోద్రావు, సంబంధిత అధికారులు, విద్యార్థినీ, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

### నైపుణ్య అభివృద్ధికి డ్యూటీ మీట్ లు

# దోహదపడతాయి

### - జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్



మొదటి పేజీ తరువాయి... ఈ డ్యూటీ మీట్ల ముఖ్యంగా నేర పరిశోధన, నేర స్థల పరిశోధన, వివిపి మూవ్మెంట్, యాంటీ సబటేజ్ చెక్, డాగ్ స్క్వాడ్ యొక్క పనితనం, ఫింగర్ ప్రింట్స్ పై పరిశోధన, ఫింగర్ ప్రింట్స్ తీయు విధానం,బాంబు డిస్పోజల్ టీం యొక్క విధులు, కంప్యూటర్ పరిజ్ఞానం, నేర స్థలం నందు ఫోటోగ్రఫీ, అవాంఛనీయ సంఘటనలు సంభవించినపుడు వీడియోగ్రఫీ చేయు విధానం, వీడియోగ్రఫీ ద్వారా నేరస్తులను కనుగొనే విధానం, లాంటి అంశాలలో రాత పరీక్ష మరియు మౌఖిక పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందిని జోనస్ పైకి ఎంపిక చేసి, వారు రాష్ట్రస్థాయి, జాతీయస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి రివార్డులను అందజేయడం జరుగుతుందని అన్నారు. పరీక్షలు కొన్ని అంశాలు ఇన్స్పెక్టర్ మరియు సబ్ ఇన్స్పెక్టర్ స్థాయి వారికి, మరి కొన్ని అంశాలు ఏఎస్ఐ, కానిస్టేబుల్ స్థాయి వారికి నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఇలాంటి డ్యూటీ మీట్ లలో పాల్గొన్నప్పుడు తమకు ఉన్న నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకోవచ్చని, ప్రస్తుత సమాజంలో నేరగాళ్లు ఉపయోగిస్తున్న నూతన పద్ధతులను తెలుసుకోవచ్చని, నూతన చట్టాలపై అవగాహన పెంపొందించుకోవచ్చని, ట్రైనింగ్ లో వాస్తవానికి ఉన్న భేదాలను గమనించవచ్చని తెలిపారు. నేరం జరుగు పద్ధతులను పరిశోధించే విధానాలను వివరంగా అర్థం చేసుకొని తమ విధులకు ఉపయోగకరంగా మార్చుకోవాలని తెలిపారు. ఎలాంటి సందేహాలు ఉన్న ఉన్నతాధికారులు, అనుభవం ఉన్న అధికారుల ద్వారా నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీలు పోతారం శ్రీనివాస్, ఎల్ జీవన్ రెడ్డి, సిహెచ్ నాగేందర్, ఇన్స్పెక్టర్లు ప్రణయ్ కుమార్, జి మొగిలి, ఏ వెంకటేశ్వరరావు, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు డి వెంకటి, ఎన్ చంద్రశేఖర్, టి మురళి, ఎస్సైలు, ఫింగర్ ప్రింట్, ఎస్ఐబి, డిసిఆర్బి, రిజర్వ్ సిబ్బంది, బిడి టీం, డాగ్ స్క్వాడ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలి

### - జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే



**ఆసిఫాబాద్ సూర్య మేజర్ న్యూస్ :** అర్హులైన నిరుపేదలకు గూడు కల్పించే ఉద్దేశంతో ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకంలో జిల్లాకు కేటాయించిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. సోమవారం జిల్లాలోని చరమేరి మండలం కొటారి గ్రామంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను గృహ నిర్మాణ శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకు కేటాయించిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. ఇండ్ల నిర్మాణ పనులలో వినియోగించే సిమెంటు ఇటుకలను, ఇసుక నాణ్యత పరిశీలించి, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఇసుకను ఉచితంగా అందిస్తుందని తెలిపారు. ఇండ్ల నిర్మాణ పనుల బిల్లులను ప్రతి సోమవారం లబ్ధిదారుడి ఖాతాలో ప్రభుత్వం జమ చేస్తుందని, బేస్ మెంట్, రూఫ్ లెవెల్, స్లాబుకు సిద్ధముగా ఉన్న ఇండ్ల వివరాలను గృహ నిర్మాణ శాఖ అధికారులు ఫోటోలతో సహా ఆన్ లైన్ పోర్టల్ లో వెంటనే నమోదు చేయాలని తెలిపారు. లబ్ధిదారుల ఖాతాలలో సకాలంలో నిధులు జమ అయ్యేవిధంగా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. అనంతరం మండలంలోని సాగర్ ఖేడా గ్రామంలో గల ప్రధానమంత్రి శ్రీ ఇంగ్లీష్ మాధ్యమ పాఠశాలను సందర్శించి 1వ తరగతి నుండి 5వ తరగతి వరకు విద్యార్థులకు అందిస్తున్న బోధన తీరును పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న పాఠ్యపుస్తకాలు, వంటకు వినియోగించే కూరగాయల నాణ్యత, వంటశాల లను పరిశీలించి మధ్యాహ్న భోజనంలో విద్యార్థులకు అందిస్తున్న పౌష్టికాహారం మెనూ వివరాలను తెలుసుకొని వంట తయారుచేసే సమయంలో తాజా కూరగాయలు, నాణ్యమైన నిత్యావసర సరుకులను వినియోగించాలని సూచించారు. తరగతి గదులు, వంటశాల, పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రభుత్వ పాఠశాలలలో త్రాగునీరు, విద్యుత్, మౌలిక సదుపాయాలను కల్పించడం జరిగిందని, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని, పాఠశాలలో 100 శాతం విద్యార్థుల హాజరు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమాలలో జిల్లా గృహ నిర్మాణ అధికారి వేణుగోపాల్ రెడ్డి, తహసీల్దార్ భూమేశ్వర్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి అంజద్ పాషా, జిల్లా విద్యాశాఖ అధికారి ఉదయ్ బాబు, మండల విద్యాధికారి ఆడే ప్రకాష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కడార్ల రంగయ్య, ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో నడుస్తున్నది చేతల ప్రభుత్వం కాదు? కోతల ప్రభుత్వమే?

## - ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్

**- కాంగ్రెస్ ప్రభుత్వం కరెంట్ కోతల ప్రభుత్వం- సిర్పూర్ ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్- దవాఖానలో నిత్యం కరెంట్ కోతలపై అసహనం వెలిబుచ్చిన రోగులు**

**కాగజ్నగర్, జూన్ 23, సూర్య మేజర్ న్యూస్:**

బీఆర్ఎస్ పార్టీ సిర్పూర్ మండల కన్వీనర్ అస్లాం జ్వరంతో బాధపడుతూ, ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని తెలుసుకొని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు డా. ఆర్ఎస్ ప్రవీణ్కుమార్ పరామర్శించడానికి సోమవారం వెళ్లగా ఆసుపత్రిలో కరెంట్ లేదు.

అక్కడి పేషెంట్లను అడుగగా రోజూ ఇలాగే కరెంట్ పోతుందని తెలపడంతో,అక్కడే ఉన్న డాక్టర్ని కలిసి జనరేటర్ సౌకర్యం కల్పించి, పేషెంట్లకు అసౌకర్యం కలగకుండా చూడాలని, అధికారులతో మాట్లాడి కరెంట్ కోతలు లేకుండా చూడాలని సూచించారు.



కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి రాష్ట్రంలో కరెంట్ ఎప్పుడు ఉంటుందో, ఎప్పుడు పోతుందో ఎవ్వరికీ తెలియడం లేదన్నారు. గతంలో బిఆర్ఎస్ పాలనలో 24 గంటల కరెంట్ ఉండేదని వారు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సిర్పూర్ నియోజకవర్గ కన్వీనర్ లెండుగురె శ్యాంరావు, నక్క మనోహర్, షేక్ చాంద్, ఖాజా, సోఫీ తదితరులు ఉన్నారు.

### అనారోగ్యంతో బాధపడుతున్న రాథోడ్ సందీప్

# వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం

## - ఎమ్మెల్యే అనిల్ జాదవ్

**నేరడిగొండ జోన్ 23 సూర్య మేజర్ న్యూస్:**

అనారోగ్యంతో బాధపడుతున్న రాథోడ్ సందీప్ కు ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆర్థిక సహాయాన్ని అందజేశారు. మండలంలోని సవర్గం



గ్రామానికి చెందిన రాథోడ్ ఇంధల్ కుమారుడు రాథోడ్ సందీప్ హైదరాబాదులోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సోమవారం వారి కుటుంబ సభ్యులకు ఇందల్ కుమారుని దవాఖాన ఖర్చులకు తక్షణ సాయం కింద రూ. 20000 /.వేలు వారికి అందజేశారు ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, సవర్గం మాజీ సర్పంచ్ సర్పంచ్ మహేందర్ జాదవ్, మండల కన్వీనర్ శివారెడ్డి, తదితరులు ఉన్నారు.

## శ్యామ్ ప్రకాష్ ముఖర్జీ చిత్రపటానికి ఘనంగా శ్రద్ధాంజలి

**శ్రీరాంపూర్ జూన్ 23 సూర్య మేజర్ న్యూస్:**

మంచిర్యాల్ మున్సిపల్ కార్పొరేషన్ లోని శ్రీరాంపూర్ డివిజన్లోని కృష్ణా కాలనీ శక్తి కేంద్రం ఇంచార్జ్ రాగి రవి ఆధ్వర్యంలో బలిదాన దీవస్ (శ్యామ ప్రకాష్ ముఖర్జీ) వర్ధంతిని పురస్కరించుకొని వారి చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా శ్రద్ధాంజలిఘనించడం జరిగింది. అనంతరం



ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా శ్యామ ప్రకాష్ ముఖర్జీ జ్ఞాపకార్థం మొక్కలు నాటడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శ్రీరాంపూర్ డివిజన్ అధ్యక్షులు సత్ర రమేష్, ప్రధాన కార్యదర్శి బద్రి శ్రీకాంత్, ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి మిట్టపల్లి మొగిలి, శక్తి కేంద్రం ఇన్చార్జులు రాగి రవి, మిడిదొడ్డి సతీష్, బూత్ అధ్యక్షులు గరిగల శ్రీనివాస్, కోరేపూ మహేందర్, రామగిరి రాకేష్, కర్ణ శ్రీనివాస్, బొబ్బల తిరుపతి, మండ శ్రావణ్, నీరటి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

### సమాజ సేవకునికి ఘనంగా సన్మానించిన

# యువ నాయకుడు వడ్నం వెంకటేష్

**కుబీర్, జూన్ 23, సూర్య మేజర్ న్యూస్:**

కుబీర్ గ్రామానికి చెందిన సాప పండరి పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తూ, అనునిత్యం- ప్రతిక్షణం సమాజ సేవలో ఉంటూ,సమస్యలపై అలుపెరుగని పోరాటం చేస్తున్న డాక్టర్ సాప



పండరిని సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ నేషనల్ చైర్మన్ డాక్టర్ కొప్పుల విజయ్ కుమార్ సాప పండరికి తెలంగాణ రాష్ట్ర సమాచార హక్కు చట్టం విభాగపు చైర్మన్ గా పదోన్నతి కల్పించడం అభినందించదగ్గ విషయమని,యువ నాయకుడు వడ్నం వెంకటేష్ పుష్పగుచ్ఛం ఇచ్చి,శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా నేషనల్ చైర్మన్ డాక్టర్ కొప్పుల విజయకుమార్ గారికి ధన్యవాదాలు తెలియజేస్తూ,డాక్టర్ సాప పండరికి శుభాకాంక్షలు తెలియజేశారు.

## నాటు సారాయికి వాడే బెల్లము, పటిక స్వాదినము

### - ఎక్సైజ్ సిఐ

**కౌటాల 23 జూన్ సూర్య మేజర్ న్యూస్:**

మండలంలోని ముత్యంపేట గ్రామములో కిరాణా షాపు నందు నాటుసారయి తయారికి వాడే 160 కిలోల బెల్లమును, 80 కిలోల పటికను స్వాదినపరుచుకొని షాపు యజమాని ప్రవీణ్ పై కేసు నమోదు చేసినట్టు కగజ్నగర్ ఎక్సైజ్ సిఐ రవి తెలిపారు. ఈ దాడులలో ఎస్సై ఐ.సురేష్, మరియు సిబ్బంది పాల్గొన్నట్టు తేలిపారు.



## డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ సేవలు మరువలేనివి

**సారంగాపూర్, జూన్ 24, సూర్య మేజర్ న్యూస్**

డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ సేవలు మరువలేనివి అని సారంగాపూర్ మండల బిజెపి అధ్యక్షులు కాల్వ నరేష్ అన్నారు. డాక్టర్



శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కాల్వ నరేష్, సీనియర్ నాయకులు శ్రావణ్ కుమార్, వీరయ్య, సాహెబ్ రావు, చేన్న రాజేశ్వర్, కరుణాసాగర్రెడ్డి, విలాస్, సాదు రామ్ రెడ్డి, నర్సయ్య, నారాయణ, రాజు, మహేష్ రెడ్డి, వెంకటేష్, లక్ష్మణ్, రంజిత్, ఉమేష్, గంగాధర్, శేఖర్, నానక్ సింగ్, దేవన్న, రాజు, దయాకర్ రెడ్డి, మచ్చేందర్, శివరాం, ప్రకాష్, జిల్లా కౌన్సిల్ మెంబర్ చవన్ దిలీప్, ప్రధాన కార్యదర్శులు రాథోడ్, నారాయణ, శ్రీకాంత్ రెడ్డి, ఉపాధ్యక్షులు భీమలింగం, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మత్తు పదార్థాల కు దూరంగా ఉండాలి

### - ఎస్ ఐ విజయ్ కుమార్

**భీమిని,జూన్23,సూర్య మేజర్ న్యూస్:**

గంజాయి మరియు మత్తు పదార్థాల కు దూరంగా ఉడాలని భీమిని ఎస్ ఐ విజయ్ కుమార్ తెలిపారు, సోమవారం మత్తు పదార్థాల పై నియంత్రణ పై అవగాహనలో భాగంగా విద్యార్థులతో పి ఎస్ ఆవరణలో చెట్లు ను నాటించారు, రామగుండం పోలీస్ కమిషనరేట్ బెల్లంపల్లి సబ్ డివిజన్ భీమిని పోలీస్ స్టేషన్ పరిధిలో గుప్త



పాఠశాల విద్యార్థులకు సోమవారం భీమిని పోలీసులు గంజాయి మరియు మత్తు పదార్థాల నియంత్రణల పై అవగాహన కల్పింస్తూ మొక్కలు నాటించినారు. గంజాయి మరియు మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలు మరియు వాటి గురించి విద్యార్థులును ఎస్ ఐ తెలియజేశారు, గంజాయి మరియు మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలు మరియు వాటి గురించి విద్యార్థులును తెలియజేశారు, మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలు అందరికీ తెలిసి ఉండాలని, ఇంట్లో తల్లితండ్రులకు వాటి గురించి తెలియచేయాలని విధ్యార్థులకు సూచించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు, పోలీసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ప్రజా ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్యామ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి

**భైంసా టౌన్,జూన్ 23,సూర్య మేజర్ న్యూస్:**

భారతీయ జనసంఘ వ్యవస్థాపక అధ్యక్షులు దేశ సమైక్యత సమగ్రత కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడు డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ బలిదాన దివస్ కార్యక్రమంలో ప్రజా ట్రస్ట్ చైర్మన్ భోస్లే మోహన్ రావు పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏక్ దేశ్ ఏక్ సంవిధన్ అని,అదే విధంగా సమాన హక్కులు పొందాలని.. దేశం లో రాజకీయ, సామాజికదేశం లో అన్ని మతాలు, కులాల వారు అన్ని రంగాల్లో న్యా యం అవసరమని శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ చెప్పేవారు. సబ్కా సాథ్, సబ్కా వికాస్, సబ్కా విశ్వాస్, సబ్కా ప్రయాస్ అనే మంత్రాన్ని అనుసరిస్తున్నా దేశంలోని అన్ని మతాలు, కులాల వారికి సమాన హక్కులు బిజెపి ప్రభుత్వం కల్పించేందుకు కృషి చేసింది అని అన్నారు అదే విధంగా ప్రధాన మంత్రి గరిబ్ కళ్యా ణ్ అన్న యోజన కింద దశాబ్దకాలం లో 81 కోట్ల మందికి పైగా లబ్ధిదారులు ప్రతి నెల ఉచిత రేషన్ పొందుతున్నారు.ఎలాంటి తారతమ్యం లేకుండా ఈ పథకం వల్ల అన్ని మతాలు కులాల వారు సమానంగా లబ్ధి పొందుతున్నారు అని మాట్లాడడం జరిగింది.

## మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలి

**నస్పూర్, జూన్ 23, సూర్య మేజర్ న్యూస్:**

గంజాయి డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలి అని, కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని నస్పూర్ ఎస్సై యు ఉపేందర్ రావు అన్నారు. ఆంటీ డ్రగ్స్ అవేర్నెస్ ప్రోగ్రాం లో భాగంగా, సోమవారం నస్పూర్ లోని జడ్పీహెచ్ఎస్ హైస్కూల్లో మత్తు పదార్థాలపై, అవగాహన కార్యక్రమం నిర్వహించినారు. స్కూల్ ఆవరణంలో విద్యార్థులతో కలిసి, మొక్కలు నాటారు. అనంతరం ఎస్ఐ



మాట్లాడుతూ, మత్తు పదార్థాలకు బానిసలై విద్యార్థులు, భవిష్యత్తును పాడు చేసుకోవద్దని, విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని, లక్ష సాధన దిశగా అడుగులు వేయాలని, అన్నారు. విద్యార్థులు కష్టపడి చదువుకోవాలని, తల్లిదండ్రులకు, గురువులకు మంచి పేరు తేవాలని అన్నారు. మీ కాలనీ, మీ చుట్టూ ప్రక్కల ప్రాంతంలో ఎక్కడైనా గంజాయి, ఇతర మత్తు పదార్థాలు విక్రయిస్తున్నట్లయితే, పోలీస్ దృష్టికి తీసుకురావాలని అన్నారు. టోల్ ఫ్రీ నెంబర్ 1905 కి కూడా కాల్ చేయవచ్చునని అన్నారు. సమాచారం అందించిన వివరాలు గోప్యంగా ఉంటాయని అన్నారు.

## సోన్ తహసీల్దార్ చర్యలు తీసుకోవాలని డిమాండ్

### - కలెక్టరేట్ ఎదుట కడ్తాల్ గ్రామ రైతుల ఆందోళన

**సోన్, జూన్ 23 సూర్య మేజర్ న్యూస్:**

రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న సోన్ తహసీల్దార్ మల్లేష్ పై చర్యలు తీసుకోవాలని నిర్మల్ జిల్లా కలెక్టరేట్ ఎదుట సోన్ మండలం కడ్తాల్ గ్రామానికి చెందిన రైతులు సోమవారం ఆందోళన చేపట్టారు. తహసీల్దార్ పై చర్యలు తీసుకోవాలని గత సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన ఎలాంటి మార్పు లేదని మీరు ఎన్ని ఫిర్యాదు చేసిన



నాపై చర్యలు తీసుకునే అధికారులు ఎవరూ లేరని ఇంకా రైతులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని అగ్రహం వ్యక్తం చేశారు. రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్న తహసీల్దార్ ను వెంటనే బదిలీ చేయాలని కోరారు. భూ సమస్యలపై కార్యాలయానికి వెళ్తే గంటలకు నిరీక్షించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. నిరక్షరాస్యులైన రైతులను తెలిసినవారు సమస్యలపై కార్యాలయానికి తీసుకెళ్తే బ్రోకర్లు చేస్తున్నామంటూ చులకనగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. మీరు ఎక్కువ మాట్లాడితే మీ సర్వే నంబర్ లను రెడ్ మార్క్ చేస్తానని భయభ్రాంతులకు గురి చేస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే తహసిల్దార్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## విద్యార్థులు చదువుతో పాటు క్రీడలలో రాణించాలి

### - జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే

**ఆసిఫాబాద్, జూన్ 23, సూర్య మేజర్ న్యూస్ :** విద్యార్థులు చదువుతో పాటు క్రీడలలో రాణించాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా




కలెక్టరేట్ భవన సముదాయం ఆభరణాలు జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఒలంపిక్ డే రన్ ర్యాలీని జండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతూ పాటు క్రీడలలో కూడా రాణించాలని అన్నారు. క్రీడల ద్వారా క్రమశిక్షణతో పాటు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలని, చదువులో ఏకాగ్రత పెంపొందుతుందని తెలిపారు. విద్యార్థులు ఆర్థిక ఉన్న క్రీడను ఎంచుకొని చదువుతో పాటు రాణించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. ఒలంపిక్ డే రన్ ర్యాలీ జిల్లా కేంద్రంలోని చిల్డ్రన్ పార్క్, కొమురం భీం చౌక్, అంబేద్కర్ చౌరస్తా, బస్టాండ్ మీదుగా సాగింది. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడా సర్వీసులు శాఖ అధికారి, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి మణెమ్మ, జిల్లా గిరిజన క్రీడల అధికారి మీనారెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఈవీఎం గోదాం ను తనిఖీ చేసిన కలెక్టర్

### ,,,కలెక్టర్ రాజర్షి షా

**అదిలాబాద్: జూన్ 23 మేజర్ సూర్య న్యూస్:** ఈవీఎం లో గోదాంను కలెక్టర్ రాజర్షి షా సోమవారం తనిఖీ చేశారు త్రైమాసిక తనిఖీ భాగంగా జిల్లా కేంద్రంలోని శాంతినగర్ లోని ఈవీఎం



పగోదాం ను కలెక్టర్ తనిఖీ చేశారు ముందుగా గోదాం సీల్ ను ప్రరిశీలించి రాజకీయ ప్రతినిధులు అధికారుల సమక్షంలో సీల్ తీసి లోపలికి వెళ్లి ఈవీఎం వీవీప్యాట్లు ఉన్న గది లోపల పరిశీలించి తిరిగి సీల్ వేయించారు కలెక్టర్ మాట్లాడుతూ నిరంతరం అప్రమత్తంగా ఉండాలని గోదాం లోపల అనుమతి లేనిదే ఎవరిని లోపలికి అనుమతించరాదని అధికారులు సెక్రెటరిటీ గాడ్ తెలిపారు సీసీ కెమెరా గదిలోకి వెళ్లి కెమెరాలు పనితీరును పరిశీలించారు అనంతరం తనకి రిజిస్టర్ లో సంతకం చేశారు ఆయన వెంట అదనపు కలెక్టర్ శ్యామల దేవి, ట్రైనింగ్ కలెక్టర్ సోనాలి ఛాంబర్ ఆయా పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ క్రీడాకారులకు క్రీడా పరికరాలను

### పంపిణి చేసిన కంది శ్రీనివాస రెడ్డి

**ఆదిలాబాద్ జూన్ 23,సూర్య మేజర్ న్యూస్:** గ్రామీణ క్రీడలను ప్రోత్సహిస్తూ తనవంతు సహాయంగా గ్రామీణ యువతకు ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి క్రీడాపరికరాలను పంపిణీ చేస్తూ ఉంటారు. సోమవారం తన క్యాంపు కార్యాలయం ప్రజా సేవాభవన్ లో కంది శ్రీనివాస రెడ్డి ఫౌండేషన్ తరపున భోరజ్ మండలం గిమ్మ గ్రామ యూత్ సభ్యులకు కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్ రావు వాలీబాల్ కిట్ ను అందించారు. యూత్ సభ్యులు కంది శ్రీనివాస రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దీపక్ రావు, నిఖిలేష్ , రాజీవ్, యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# సీజనల్ వ్యాధులు ప్రభలకుండా జాగ్రత్తలు వహించాలి

### - స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

**నిర్మల్,సూర్య మేజర్ న్యూస్ :** వర్షాకాలం నేపథ్యంలో డయేరియా కేసులు పెరిగే అవకాశం ఉన్నందున, ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అతిసార వ్యాధి నిరోధక అవగాహనా కార్యక్రమంపై ఆయన అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, వర్షాకాలం నేపథ్యంలో జిల్లాలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆహార, నీరు, పారిశుధ్య విషయాల్లో మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని, పట్టాన, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. ఈనెల 16వ తేదీ నుంచి



జూలై 31 వరకు ఇంటెన్సిఫైడ్ డయేరియల్ కంట్రోల్ ఫోర్ట్‌నైట్ (ఐడీసీఎఫ్) కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా నిర్వహించాలని సూచించించారు. 5 ఏళ్ల లోపు చిన్నారుల్లో నీళ్ల విరేచనాల నివారణ లక్ష్యంగా 45 రోజులపాటు అవగాహనా కార్యక్రమాలు కొనసాగుతాయని ఆయన తెలిపారు. జిల్లాలో 1,88,929 కుటుంబాలలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సర్వేలో నిర్వహించి 73,715 మంది చిన్నారులను గుర్తించడం జరిగిందని తెలిపారు. ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూ ఇంటింటికీ ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయాలని సూచించారు. అంగన్వాడీలు, పాఠశాలలు, వసతి గృహాలలో పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. వర్షాకాలంలో డయేరియా ప్రభావం అధికంగా ఉండే కారణంగా ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలను పంపిణి చేయాలనీ ఆదేశించారు. ఇటుక బట్టీలు, గిరిజన తండాలు, సంచార జాతుల నివాస ప్రాంతాల్లో మొబైల్ వాహనాల ద్వారా వైద్యసేవలు అందించాలని అదనపు కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, డీఎంహెచ్ఓ డా. రాజేందర్, ఆర్డీఓ రత్నకల్యాణి, ఐసీడీఎస్, పంచాయతీరాజ్, మున్సిపల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా బీజేపీ నివాళులు

**మంచిర్యాల టౌన్, జూన్ 23,సూర్య మేజర్ న్యూస్:** జన సంఘ్ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా బలిదాన్ దివస్‌ను పురస్కరించుకోని సోమవారం బీజేపీ మంచిర్యాల జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు,కార్యకర్తలు శ్యామ ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్ గౌడ్ మాట్లాడుతూ ఒకే



దేశంలో రెండు జెండాలు, రెండు రాజ్యాంగాలు ఉండవద్దు అనే నినాదంతో ఆర్టికల్ 370 రద్దు చేయాలని శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ పోరాటం చేశారని అన్నారు. దేశ ప్రయోజనాల కోసం జన సంఘ్ స్థాపించి ప్రజల కోసం పోరాటం చేసిన గొప్ప నాయకుడు ముఖర్జీ అన్నారు. ముఖర్జీ ఆశయాలను బీజేపీ నాయకులు అందరూ కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి పురుషోత్తం,దుర్గం అశోక్,పట్టి వెంకట కృష్ణ,బియ్యాల సతీష్ రావు,ఆకుల అశోక్ వర్ధన్,ఎనగందుల కృష్ణ మూర్తి,గాజుల ముఖేష్ గౌడ్,తుల ఆంజనేయులు,జోగుల శ్రీదేవి,కర్రె లచ్చన్న,అమిరిశెట్టి రాజ్ కుమార్,పల్లి రాకేష్, వైద్య శ్రీధర్,నాగుల రాజన్న,మెరిడికొండ శ్రీనివాస్,రెడ్డిమల్ల అశోక్,రాకేష్ రెన్వ,తరుణ్ సింగ్,చిరంజీవి,తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి మరొకరికి తీవ్ర గాయాలు

**జన్నారం, జూన్ 23, సూర్య మేజర్ న్యూస్ :** జన్నారం మండలం కలమడుగు గ్రామంలో ఈ నెల 22న జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉప్పల్ వార్ వనిత (35) మృతి చెందగా మరో మహిళ గంగ లక్ష్మి కి తీవ్ర గాయాలు కాగా హుటాహుటిన మెరుగైన వైద్యం కోసం అంబులెన్స్ లో కరీంనగర్ ఆసుపత్రికి తరలించడం జరిగిందని జన్నారం ఎస్సై గొల్లపల్లి అనూష తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం లింగాపూర్ కు చెందిన ఉప్పల్ వార్ వనిత ఆమె తల్లి రేండ్లగూడ కు చెందిన కస్తులపురి గంగ లక్ష్మి తో కలిసి కలమడుగు లోని బంధువుల ఇంటికి కాలినడకన వెళ్తుండగా ఎదురుగా వచ్చిన ఆటో అతివేగంగా, అజాగ్రత్తగా నడిపి ఢీకొట్టడంతో హేమలతతో పాటు గంగా లక్ష్మికి తీవ్ర గాయాలు కాగా ఆసుపత్రికి తరలించగా రాత్రి 9 గంటల ప్రాంతంలో హేమలత చికిత్స పొందుతూ మృతి చెందగా గంగ లక్ష్మి ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతుందని ఎస్సై అనూష తెలిపారు. అతివేగంగా నడిపి ఢీ కొట్టిన కలమడుగు గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ హనుమండ్ల సత్తన్న పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై అనూష తెలిపారు.

## డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

**మంచిర్యాల టౌన్,సూర్య మేజర్ న్యూస్:** మంచిర్యాల జిల్లా షి టీమ్ సోమవారం ముల్కల్ల లోని సోషల్ వెల్ఫేర్ పాఠశాల,కళాశాల (బాలుర)నందు విద్యార్థులకు డ్రగ్స్,షి టీమ్ మీద అవగాహన కార్యక్రమం



నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా షి టీమ్ ఇంచార్జి ఇన్స్పెక్టర్ నరేష్ మాట్లాడుతూ డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం అన్నారు. డ్రగ్స్ వలన కలిగే అనర్థాలు,జిల్లాలో ఉన్న షీ టీమ్ దాని యొక్క ప్రాముఖ్యత నిర్వహించే విధుల,మానవ అక్రమ రవాణా,ఫోక్సో చట్టాల, బాల్య వివాహాలు దాని యొక్క పరిణామాల గురించి వివరించారు. ఈవ్ టిజింగ్,టీ-సేఫ్ అప్లికేషన్ తదితర అంశాల గురించి,పోష్,సోషల్ మీడియా దాని యొక్క పరిణామాల గురించి,సైబర్ క్రైమ్స్ పై అవగాహన కలిపించారు. సైబర్ హెల్ప్ లైన్ నంబర్ 1930 గురించి,డయల్ 100 ప్రాముఖ్యత,సమాజ రుగ్మతల గురించి సమాజంలో జరుగుతున్న నేరాలు వాటి నుండి ఎలా రక్షణ పొందాలి తెలిపారు. మహిళల,పిల్లల రక్షణకు ఉన్న చట్టాల గురించి,సోషల్ మీడియా వల్ల జరుగు నష్టాలు,లాభాల గురించి అవగాహన కల్పించారు. ఎవరైనా డ్రగ్స్ సేవించిన,మహిళలను వేధించిన,రోడ్డుపై వెళ్లేటప్పుడు అవహేళనగా మాట్లాడిన, ఉద్దేశపూర్వకంగా వెంబడించిన వెంటనే 100 లేదా,రామగుండం షీ టీమ్ నెంబర్ 6303923700 కు ఫిర్యాదు చేసినచో వారి మీద చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా షి టీమ్ ఎస్ఐ హైమ,కానిస్టేబుల్స్ శ్రవణ్,జ్యోతి,శ్రీలత, పాఠశాల ప్రిన్సిపాల్ మోహన్,వైస్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## జన్నారం ఎఫ్డిఓ గా రామ్మోహన్ బాధ్యతలు స్వీకరణ

**జన్నారం, జూన్ 23, సూర్య మేజర్ న్యూస్ :** జన్నారం ఫారెస్ట్ డివిజనల్ ఆఫీసర్ గా ఎం.రామ్మోహన్ సోమవారం సాయంత్రం జన్నారం డివిజన్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. గత కొంతకాలంగా ఖాళీగా ఉన్న ఎఫ్డిఓ స్థానం మంచిర్యాల డిఎఫ్వో శివ ఆశిష్ సింగ్ ఇన్చార్జి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. హైదరాబాద్ లోని దూలపల్లి ఫారెస్ట్ అకాడమీ లో విధులు నిర్వహిస్తున్న రేంజ్ ఆఫీసర్ రామ్మోహన్ కు ఎఫ్డిఓ గా పదోన్నతి కల్పిస్తూ ఇటీవలే పిసిసిఎఫ్ సువర్ణ ఉత్తర్వులు జారీచేసిన విషయం విధితమే. ఎట్టకేలకు పదోన్నతి పొందిన ఎఫ్డిఓ రామ్మోహన్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన రామ్మోహన్ ను జన్నారం, ఇంధన్ పల్లి రేంజ్ ఆఫీసర్లు అలాగే డివిజన్ సిబ్బంది శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎఫ్డిఓ రామ్మోహన్ మాట్లాడుతూ అడవులను కాపాడుకునే బాధ్యత అందరిపై ఉందని, ప్రజల సహకారంతో డివిజన్లో ఉన్న సమస్యలను అంచెలంచెలుగా పరిష్కరిస్తానన్నారు.



## గిరిజనుల అభివృద్ధి కోసమే
### పీఎం జుగా పథకం ఏ టి డి ఓ చిరంజీవి

**తిర్యాణి,సూర్య మేజర్ న్యూస్ :** గిరిజనుల అభివృద్ధి కోసమే కేంద్ర ప్రభుత్వం పీఎం జుగా పథకాన్ని తీసుకువచ్చిందని ఏ టి డి ఓ చిరంజీవి అన్నారు. ఈ పథకానికి సంబంధించి అవగాహన కార్యక్రమాన్ని మండలంలోని గోయగం గ్రామపంచాయతీలో నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. భారతదేశంలో



గిరిజనుల అభివృద్ధి కోసం ప్రధానమంత్రి జన జాతీయ గ్రామీణ ఉత్కర్ష అభియాన్ అనే పథకాన్ని ప్రవేశపెట్టిందని తెలిపారు. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో 102 గిరిజన గ్రామాలలో ఈ పథకాన్ని అమలుపరుస్తున్నట్లు తెలియజేశారు. ఇందులో గిరిజనులకు సంబంధించిన ఆధార్ కార్డు, ఆయుష్మాన్ భారత్ కార్డులు లేనివారిని గుర్తించి వాళ్ళకి నూతనంగా ఈ కార్డులను అందజేయడం జరుగుతుందని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని సదస్సులు నిర్వహించి గిరిజనుల అభివృద్ధి కోసం అనేక కార్యకలాపాలు కొనసాగించడం జరుగుతుందని పేర్కొన్నారు. పీఎం జుగా పథకం ద్వారా గిరిజనులకు 90 శాతం సబ్సిడీతో మేకలు, గొర్రెలు, పందుల పెంపకం, కోళ్ల పెంపకం, వంటి ఆర్థిక ప్రోత్సాహ స్కీంలను అందించడం జరుగుతుందని తెలిపారు. గిరిజనులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మల్లేష్, దక్కన్ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్ ఐ టి డి ఏ తరఫున పీఎం జుగా ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఎస్ఆర్ పి వెడ్మ యశ్వంత్ రావ్, వెటర్నరీ డాక్టర్ సాగర్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ సదస్సులు మళ్లీ నిర్వహించాలి తుడుం దెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి భగవంత్ రావు

**తిర్యాణి సూర్య మేజర్ న్యూస్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభారతి చట్టం కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులు మళ్ళీ నిర్వహించాలని తుడుం దెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి వెడ్మ భగవంత్ రావు డిమాండ్ చేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిర్యాణి మండలంలో తాసిల్దార్ కార్యాలయ సిబ్బంది నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులకు ప్రజలనుండి స్పందనలేదని తెలిపారు. దీంతో ప్రజల భూ సమస్యలు. సమస్యలుగానే ఉండిపోతున్నాయని పేర్కొన్నారు. వ్యవసాయ పనులు ప్రారంభం అయిన ఈ సమయంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించడమేమిటి అని ప్రశ్నించారు. రైతులంతా వారి వారి పొలాలలో విత్తనాలు విత్తే కార్యక్రమంలో ఉండగా రెవెన్యూ సదస్సులను నిర్వహించడం సబబు కాదని పేర్కొన్నారు. తాత్కాలికంగా రెవెన్యూ సదను నిలిపివేసి రైతులు వారి పనులు పూర్తయ్యాక మళ్లీ రెవెన్యూ సదస్సులు నిర్వహించాలని పేర్కొన్నారు.

## ఎంపీపీఎస్ స్కూల్‌లో మొక్కలు నాటే కార్యక్రమం

**వాంకిడి, జూన్ 23,సూర్య మేజర్ న్యూస్:** మండల కేంద్రంలోని వాంకిడి కలాన్ ఎం పి పి ఎస్ స్కూల్‌లో సోమవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా వాంకిడి సీఐ సత్యనారాయణ మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అన్నారు. అందరం కలిసి మొక్కలు నాటుతూ పర్యావరణాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు దుర్గం ప్రశాంత్ మాట్లాడుతూ, విద్యార్థులు మొక్కలు నాటి పరిసరాలను హరితవనంగా మార్చేందుకు తొలి అడుగు వేసినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ నాటిన మొక్కలను సంరక్షించే బాధ్యత తీసుకోవాలని సూచించారు. వాతావరణంలో ప్రాణవాయువు శాతం పెంచేందుకు, కాలుష్యం తగ్గించేందుకు, వర్షాలు సకాలంలో పడేందుకు మొక్కలు కీలకమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు టేబుల్ బుక్స్, పేన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఓబీసీ సెల్ అధ్యక్షుడు జాబోరే గణేష్, సీనియర్ నాయకులు సుధాకర్, గుండన్నా, ఆర్యా సంఘం జిల్లా అధ్యక్షుడు జైరాం, గణేష్, హెచ్ఎం ఉప్రే వినేష్ ,ముభినా భేగాం, చైర్ పర్సన్ శైలజ మేడం తదితరులు పాల్గొన్నారు.



# మిషన్ భగీరథ నీళ్ల కోసం రోడెక్కిన గిరిజనులు

**- ప్రధాన రహదారిపై రాస్తారోఖో, బైటాయింపు**

**- గంట పాటు ట్రాఫిక్ జామ్**

**కెరమెరి, సూర్య మేజర్ న్యూస్**



మిషన్ భగీరథ నీళ్ల కోసం మండలంలోని బాబేఝరి గ్రామానికి చెందిన గిరిజనులు సోమవారం రోడెక్కారు.తమ గ్రామానికి గత నెల రోజులుగా మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదని గ్రామస్తులు రోడ్డుపై బైఠాయించారు. మెడిసిన్ మిషన్ భగీరథ నీటి సమస్యను గ్రామస్తులు అధికారులకు తెలిపినప్పటికీ అధికారుల నిర్లక్ష్యానికి ఆగ్రహించిన గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. ప్రధాన రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. దీంతో ఇరువైపులా వాహనాలు ఎక్కడికక్కడే అధిక సంఖ్యలో నిలిచిపోవడంతో గంటపాటు ట్రాఫిక్ సమస్య తలెత్తింది. రోడ్డుకి ఇరువైపులా వాహనాలు అధిక సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. అధికారులు వచ్చి తమ సమస్యను పరిష్కరించే అంతవరకు రోడ్డుపై నుంచి కదిలేది లేదని రోడ్డుపైనే బిస్మించి కూర్చున్నారు. అధికారుల తీరుకు నిరసనగా నినాదాలు చేపట్టారు.గతంలో పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోవడం లేదని ఆరోపించారు. గత నెలలో తాగునీటి లభించక కొన్ని మూగజీవాలు మృతి చెందాయని తెలిపారు.జోడే ఘాట్ పోరు గ్రామాల్లో మిషన్ భగీరథ తాగునీరు సరఫరా కావడం లేదని ఆరోపించారు. వేసవికాలంలోనూ అదే తీరు కొనసాగించిన అధికారులు మాత్రం మిషన్ భగీరథ నీటి సరఫరా సమస్యను తీర్చలేదని పేర్కొన్నారు. మిషన్ భగీరథ నీరు సరఫరా కావకపోవడంతో గిరిజన గ్రామాలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయని అన్నారు. మిషన్ భగీరథ నీటి సమస్యను అధికారుల అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఎందుకు పట్టించుకోవడంలేదని ప్రశ్నించారు. విషయం ఎస్సై ఎన్ మధుకర్ సంఘటన స్థలానికి చేరుకొని ఆందోళనకారులను సముదాయించే ప్రయత్నం చేసినప్పటికీ ఎలాంటి ఫలితం లేకుండా పోయింది.నీటి సమస్య తీవ్రంగా ఉందని పశువులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్తులు సుభాష్, గోపాల్ ఎస్సై కాళ్లు పట్టుకున్నారు.మిషన్ భగీరథ నీళ్లు తమ గ్రామానికి వచ్చేవరకు రోడ్డు పైనుంచి కదిలేది లేదని తేల్చి చెప్పారు. రోడ్డుపై ధర్నా చేస్తున్న సమయంలో ఉట్నూరు వైపు నుండి ఆసిఫాబాద్ వైపుకి వస్తున్న అడిషనల్ కలెక్టర్ దీపక్ తివార. నీటి సమస్యను తీర్చాలని విన్నవించే ప్రయత్నం చేసినప్పటికీ వాహనం నిలపక పోగా గిరిజనులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టర్ దిగిరావాలని పట్టుబడ్డారు. అడిషనల్ కలెక్టర్ ఆందోళన కారుల వద్దకు రాకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. మిషన్ భగీరథ నీటి కోసం తాము ధర్నా నిర్వహిస్తుంటే, అడిషనల్ అడిషనల్ కలెక్టర్ పట్టించుకోకపోవడంపై గిరిజనులు అసహనం వ్యక్తం చేశారు. ఐదుగురు వచ్చి సమస్యను చెప్పాలని ఎస్సైతో చెప్పి నచ్చ చెప్పే ప్రయత్నం చేసినప్పటికీ ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. అడిషనల్ కలెక్టర్ దిగిరావాలని నినాదాలు చేయడంతో అడిషనల్ కలెక్టర్ ముందుకు కదిలారు. దీంతో గ్రామస్తులు అంతా పట్టించుకోని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ తమ ధర్నాను కొనసాగించారు. అనంతరం స్థానిక ఎస్సై గ్రామస్తులను సముదాయించారు. రోడ్డుపై ఎక్కడికక్కడ వాహనాలు నిలిచిపోవడంతో ట్రాఫిక్ సమస్యలు ఏర్పడి, ప్రజలకు ఇబ్బందులు పడుతున్నట్లు గ్రామస్తులకు నచ్చ చెప్పారు. ఎంపీడీవో కార్యాలయం వద్దకు రావాలని సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి నేటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తారని హామీ ఇవ్వడంతో బాబే ఝరి గ్రామస్తులు ఎంపీడీవో కార్యాలయానికి చేరుకొని ధర్నా చేపట్టారు. ఆర్డబ్ల్యూఎస్ ఏఈ విశ్వేశ్వర్ కు వినతి పత్రం అందజేశారు. అక్షరమే మిషన్ భగీరథ నీటి సరఫరా చేయాలని విన్నవించారు.లేని పక్షంలో కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు మూట ఎల్లయ్య, రాథోడ్ సుభాష్, రాథోడ్ గోపాల్ నాయక్, ఆత్రం కొండూ, మూట చిన్ను, సిడాం మాని, టెకం రాజు చౌహాన్ పండిత్ తదితరులు పాల్గొన్నారు.

### విలేకరుల పై అనుచిత వ్యాఖ్యల చేసిన కాంగ్రెస్
# నాయకుడిపై పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు

**- జర్నలిస్టుల ఐక్యతను చాటుతూ మడ్డి వేణు, 70 మంది వర్కింగ్ జర్నలిస్టుల మద్దతు.**

**మందమర్రి,జూన్ 23,సూర్య మేజర్ న్యూస్:**

పత్రికారంగాన్ని హేళన చేసే విధంగా వ్యాఖ్యలు చేసిన ఓ కాంగ్రెస్ నాయకుడిపై జర్నలిస్టులు తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేశారు. విలేకరులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన అతని పై మండలంలోని వర్కింగ్



జర్నలిస్టులు పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేశారు.ఈ ఘటనలో సూర్య రిపోర్టర్ మడ్డి వేణు ముందుండగా, దాదాపు 70 మంది వర్కింగ్ జర్నలిస్టులు ఐక్యంగా మద్దతు తెలిపారు.విలేకరుల ఆత్మగౌరవాన్ని కించపరిచేలా మాట్లాడటాన్ని తాము సహించబోమని,ఇటువంటి చర్యలపై భవిష్యత్తులో మరింత బలంగా స్పందిస్తామని వారు పేర్కొన్నారు.మందమర్రి ప్రెస్ క్లబ్ విలేకరుల సంఘం ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించింది.”సామాజిక బాధ్యతతో పనిచేస్తున్న జర్నలిస్టులను లక్ష్యంగా చేసుకుని ఈ విధంగా మాట్లాడడం సర్వత్రా ఖండించదగ్గది.మా మిత్రుడికి అండగా నిలబడటం మా బాధ్యత,”అని విలేకరులు స్పష్టం చేశారు.కాంగ్రెస్ నాయకుడు విలేకరులను పరోక్షంగా దూషించినందుకు బహిరంగంగా క్షమాపణ చెప్పే వరకు మండలంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులకు సంబంధించిన వార్తలను రాయబోమని తెలిపారు.

## ప్రజా ఫిర్యాదుల విభాగానికి భారీ స్పందన

**- ఫిర్యాదులపై సిబ్బంది తక్షణమే స్పందించాలని ఆదేశం**

**- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్.**

ఆదిలాబాద్,జూన్’ 24సూర్య మేజర్ న్యూస్ : పోలీసు కార్యాలయంలో ప్రజా ఫిర్యాదులను జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ నిర్వహించరు. సందర్భంగా పెద్ద ఎత్తున ప్రజలు తమ సమస్యలను నేరుగా జిల్లా పోలీసు ముఖ్య అధికారికి తెలియజేసి సమస్యలను పరిష్కరించాలని కోరారు. జిల్లా నలుమూలల నుండి వచ్చిన 72 ఫిర్యాదుదారులు జిల్లా ఎస్పీకి నేరుగా సమస్యలను విన్నవించుకున్నారు. ప్రజా ఫిర్యాదుల లో భూ సమస్యలు, చీటింగ్ కేసులు, ఫోర్జరీ కేసులు, భార్యాభర్తల తగాదాలు, ఇతర సమస్యలతో జిల్లా ఎస్పీ ని సంప్రదించరు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నేరుగా సంప్రదించలేని వారు వాట్సప్ ద్వారా 8712659973 నెంబర్ కు సంప్రదించాలని తెలిపారు. సమాచారం అందించిన వారి వివరాలు ఫిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని అన్నారు. ప్రజలు ఎలాంటి మోసాలకు గురైన వెంటనే జిల్లా పోలీసు యంత్రాంగాన్ని సంప్రదించవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో సీసీ కొండరాజు, ప్రజా ఫిర్యాదుల విభాగం అధికారిని జైస్వాల్ కవిత, వామన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాల నిర్మూలన మనందరి బాధ్యత
### తిర్యాణి ఎస్ఐ శ్రీకాంత్

**తిర్యాణి సూర్య మేజర్ న్యూస్ :** మాదకద్రవ్యాల నిర్మూలన మనందరి బాధ్యత అని తిర్యానీ ఎస్ఐ శ్రీకాంత్ అన్నారు. కొమరం భీం ఆసిఫాబాద్ ఎస్పీ కాంతిలాల్ పాటిల్ ఆదేశాల మేరకు మండలంలోని మంగి ఆశ్రమ పాఠశాలలో ప్రజలకు, యువతకు, విద్యార్థులకు, మారకద్రవ్యాలపై అవగాహన కల్పించడం జరిగిందని తెలిపారు. యువత ప్రజలు గంజాయి డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాలకు అలవాటు పడి ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని, సూచించారు. మాదకద్రవ్యాల దుర్వినియోగం వల్ల వ్యక్తిగతంగా నే కాకుండా కుటుంబం సమాజం మరియు దేశం పైన ప్రతికూల ప్రభావాన్ని చూపిస్తుందని తెలిపారు. పాఠశాల, కళాశాలలో విద్యార్థులకు, గ్రామపంచాయతీ పరిధిలో ప్రజలకు మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై వివరించడం జరిగిందని తెలిపారు ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వైద్యం, విద్యా విషయంలో తగ్గేదెలే

**- నాకు ఋణం తీర్చుకునే అవకాశం ప్రజలు ఇచ్చారు**

**- రాష్ట్రంలోనే పట్టణాన్ని ది బెస్ట్ గా నిలబెడతా..**

**- వైద్యం, విద్యాను ప్రజలు ఉపయోగించుకోవాలి**

**- ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు**

**లక్షెట్టిపేట, జూన్ 23, సూర్య మేజర్ న్యూస్ :**

వైద్యం, విద్యా విషయంలో తగ్గేదెలే అని సోమవారం పట్టణంలోని నూతనంగా నిర్మితమవుతున్న హాస్పిటల్ ను పర్యవేక్షించిన ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజలందరికీ నాణ్యమైన కార్పొరేట్ వైద్యం, విద్యా అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్య లక్ష్యం అని ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు అన్నారు. అనంతరం నూతనంగా నిర్మించిన ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన ఆయన ప్రైవేట్ పాఠశాల, కళాశాలలకు దీటుగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉచిత విద్య, వైద్యం ప్రజలందరికీ అందించాలనేది కాంగ్రెస్ ముఖ్య



ఉద్దేశం అని అన్నారు. ఈ కార్యక్రమం లో డిసిసి జిల్లా ఉపాధ్యక్షుడు చింత అశోక్ కుమార్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఎండి ఆరీఫ్, ఆర్టిఐ మెంబర్ అంకతి శ్రీనివాస్, గడ్డం త్రిమూర్తి, కాంగ్రెస్ నాయకులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేటు కంటే, ప్రభుత్వ బడులే అన్నింట్లో మెరుగు

**-ఆదర్శంగా నిలుస్తున్న గురుడుపేట మాజీ సర్పంచ్ బ్రహ్మయ్య**

**కాగజ్నగర్, జూన్ 23, సూర్య మేజర్ న్యూస్:**

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలం, గురుడుపేట గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మెర్పల్లి బ్రహ్మయ్య తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలల నుండి ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి ఆదర్శంగా



నిలిచారు. ప్రభుత్వ పాఠశాలల్లో బోధనా విధానం మెరుగుపడటం, అలాగే విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు ఆయన్ని ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ సానుకూల మార్పులను గమనించిన బ్రహ్మయ్య తన పిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసం ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇప్పుడు ఆయన పిల్లలు గురుడుపేటలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యనభ్యసిస్తున్నారుఈ పరిణామం ప్రభుత్వ పాఠశాలల పట్ల ప్రజల్లో పెరుగుతున్న విశ్వాసానికి నిదర్శనమని మండల ప్రజలు చర్చించుకుంటున్నారు. ప్రభుత్వం కార్పోరేట్ స్థాయికి దీటుగా ప్రభుత్వ బడులలో విద్యాప్రమానాలను మెరుగు పరచి ఇంకా పెంచుతూ అన్ని రకాల సౌకర్యాలు విద్యార్థులకు కల్పిస్తూ ఉన్నతమైన విద్యను అందిస్తూ చేస్తున్న ఈ కృషిని ఆదర్శంగా తీసుకొని ప్రజలుఈ మాజీ సర్పంచి లాగే ప్రతి ఒక్కరు తమ పిల్లలను ప్రభుత్వ బడులలో చదివిపించాలని కోరుతున్నరు.

## డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ 72వ ఘనంగా వర్ధంతి

**మామడ ,సూర్య మేజర్ న్యూస్**

రోజున.భారతీయ జనతా పార్టీ మామడ మండలం శాఖ ఆధ్వర్యంలో డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ 72వ వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించడం జరిగింది ఇందులో



మండల అధ్యక్షులు బత్తుల రంజిత్ కుమార్, ఉపాధ్యక్షులు కర్రల లక్ష్మి ,వన్ నేషన్ వన్ ఎలక్షన్ వాయిస్ కోఆర్డినేటర్ కుశీల పవన్, ముండ్ల చిన్న ఆశన్న, నరేందర్ రెడ్డి, నరేష్, కొర్రి రాజేశ్వర్, చిఎన్నోల్ల నడ తదితరులు పాల్గొన్నారు.

# గుట్ట పక్క తాండ గ్రామానికి రోడ్డు వేయిస్తా

**-ఎమ్మెల్యే అనిల్ జాదవ్**

**నేరడిగొండ జూన్ 23 సూర్య మేజర్ న్యూస్:**

సోనాల మండలంలోని గుట్ట పక్క తండా గ్రామంలో సోమవారం ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పర్యటించారు. గ్రామంలో ఉన్న కృష్ణ మందిరాన్ని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సందర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.



అనంతరం గుట్ట పక్క తాండ గ్రామస్తులు ఎమ్మెల్యే అనిల్ జాదవ్ కు రోడ్డు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. వారి సమస్య లు విన్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్ గ్రామానికి రోడ్డు వేసే బాధ్యత తనదని అన్నారు. త్వరలోనే రోడ్డుపనులు ప్రారంభించి పూర్తి చేసి మీ కష్టాలు తీర్చే బాధ్యత తనదని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో ఎమ్మెల్యే వెంబడి మాజీ ఎంపీపీలు తులా శ్రీనివాస్, ప్రీతం రెడ్డి, రాథోడ్ సజన్, నాకు సరిత గులాబీ సింగ్, సకారాం, ప్రతాప్ సింగ్, సదానందం, సుధీర్ రెడ్డి,సోమన్న, దేవేందర్ రెడ్డి జీవన్, తదితరులు ఉన్నారు.

**ఉద్యోగుల రక్షణలో ఫ్రంట్ లైన్**

## సూపర్వైజర్ల పాత్ర అత్యంత కీలకమైనది

**శ్రీరాంపూర్ ,జూన్ 23 సూర్య మేజర్ న్యూస్:**

శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ ఎం. శ్రీనివాస్ శ్రీరాంపూర్ వృత్తి శిక్షణ కేంద్రంలో, శ్రీరాంపూర్ ఏరియాలో పనిచేస్తున్న భూగర్భ, ఉపరితల గనుల వివిధ విభాగాల ఫ్రంట్ లైన్ సూపర్వైజర్లకు 12 రోజుల శిక్షణ తరగతులను ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ మాట్లాడుతూ ఫ్రంట్ లైన్ సూపర్వైజర్లుకు ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి స్ట్రక్చర్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ సింగరేణి వ్యాప్తంగా




నిర్వహించడం జరుగుతుందని అందులో భాగంగా సోమవారం శ్రీరాంపూర్ ఏరియాలో నిర్వహించడం జరిగిందని చెప్పారు. సింగరేణి ఉత్పత్తి చేస్తున్న బొగ్గును రక్షణతో వెలికితీయడానికి ఫ్రంట్ లైన్ సూపర్వైజర్లు చేస్తున్న కృషి అత్యంత విలువైనదని కొనియాడారు. భూగర్భ, ఉపరితల గనులలో ఫ్రంట్ లైన్ సూపర్వైజర్లు ముందు ఉండి అక్కడి పరిస్థితులను అర్థం చేసుకొని బొగ్గు వెలికితీత కార్యక్రమాలను మొదలు చేస్తారు. భూగర్భ, ఉపరితల గనులలో ఏమైనా ప్రమాద పరిస్థితులు ఉంటే బొగ్గు వెలికితీత కార్యక్రమంలో తగిన రక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుందని చెప్పారు. ఉద్యోగుల రక్షణలో కూడా వీరి పాత్ర అత్యంత కీలకమైనది అని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఓ టు జి ఎం ఎన్. సత్యనారాయణ, గుర్తింపు సంఘం బ్రాంచ్ సెక్రటరీ బాజీ సైదా, వృత్తి శిక్షణ కేంద్రం మేనేజర్లు కల్లూరి వెంకట రామారావు, కమురుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## మర్యాదపూర్వకంగా సిఐని కలిసిన నూతన ఎస్సై

**కాగజ్నగర్ ,జూన్ 23, సూర్య మేజర్ న్యూస్:**

కాగజ్ నగర్ పట్టణ పోలీస్ స్టేషన్లో ఈరోజు సోమవారం నూతన ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన డి, సాగర్ ఈ సందర్భంగా ఆయన మర్యాదపూర్వకంగా పట్టణ ఎస్ హెచ్ ప్రేమ్ కుమార్ ని కలిసి పూల మొక్కను అందించారు.




# విద్యార్థులు డ్రగ్స్ బారిన పడొద్దు

**-ఎస్సై సురేష్**

**లక్షెట్టిపేట, జూన్ 23, సూర్య మేజర్ న్యూస్:**

విద్యార్థులు డ్రగ్స్ బారిన పడొద్దని సోమవారం పట్టణంలోని గుడ్ షఫెర్డ్ స్కూల్ లో నిర్వహించిన డ్రగ్స్ పై అవగాహన సదస్సులో ముఖ్య అతిథిగా స్థానిక ఎస్సై సురేష్ పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్సై మాట్లాడుతూ.. డ్రగ్స్ వాడటం వల్ల కలిగే నష్టాల గురించి



విపులంగా తగు ఉదాహరణలతో విద్యార్థులకు సూచించారు. చాలా మంది విద్యార్థులు డ్రగ్స్ బారిన పడి వారి విలువైన జీవితాలు కోల్పోయిన సంఘటనలు చాలా ఉన్నాయి కాబట్టి విద్యార్థులు ఎవరు డ్రగ్స్ కు అలవాటు కావద్దు అని కోరారు. విద్యార్థి దశ చాలా కీలకం కాబట్టి చెడ్డ అలవాట్లకు దూరంగా ఉండి చదువు పై ద్రుష్టి పెట్టి ఉన్నతమైన చదువులు చదివి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకోని రావాలని సూచనలు చేశారు. అవగాహనా కార్యక్రమం ఏర్పాటు చేసిన అనంతరం పాఠశాల ఆవరణలో విద్యార్థుల తో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమం లో పాఠశాల కరెస్పాండంట్ వై.శ్రీనివాస్ ప్రిన్సిపాల్ సెభాస్టియన్ విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సిరికొండ గ్రామానికి 38 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు

**నేరడిగొండ ,జూన్ 23 సూర్య మేజర్ న్యూస్:**

మండలంలోని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ నివాసంలో సోమవారం సిరికొండ మండల సర్పంచ్ గ్రామస్తులు గ్రామానికి 38 ఇందిరమ్మ ఇల్లు



మంజూరు చేసినందుకు ఎమ్మెల్యే అనిల్ జాదవ్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యేతో వారు మాట్లాడుతూ గ్రామానికి మరికొన్ని ఇందిరమ్మ ఇల్లు ఇప్పించాలని ఎమ్మెల్యేని కోరారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి గ్రామానికి మరికొన్ని ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయిస్తానని వారికి హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో సిరికొండ మాజీ సర్పంచ్ ఓరగంటి పెంటన్న, తోకల చిన్న రాజన్న, (చందు ) ఇచ్చోడ మాజీ ఎంపిపి ప్రితం రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు

# విద్యార్థిని ఆత్మ హత్య

**లక్షెట్టిపేట, జూన్ 23, సూర్య మేజర్ న్యూస్:**

గోదావరి రోడ్డుకు చెందిన బత్తుల జ్యోష్ణ అనే 15సంవత్సరాల వయస్సు గల యువతి ఇంట్లో ఉరి వేసుకొని మృతి చెందిన ఘటన పట్టణంలో చోటు చేసుకుంది. స్థానిక ఎస్సై సురేష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మృతురాలు పట్టణంలోని బాలికల పాఠశాలలో 10వ తరగతి చదువుతుంది. మృతురాలి తల్లి మూడు రోజుల క్రితం వాళ్ళ అమ్మవాళ్ళ ఊరు అయిన నల్లగొండ జిల్లా చిత్తలూరు వెళ్ళింది. తన భర్త వెంకటి మొదటిబార్య కొడుకు చంద్రశేఖర్ ఈరోజు ఉదయం ఫోన్ చేసి చెల్లి జ్యోష్ణ ఇంట్లో రేకుల షెడ్డు కింది రాడుకు చున్నీతో ఉరివేసుకొని చనిపోయింది వెంటనే రమ్మని చెప్పగా తల్లి వచ్చి చూసే సరికి చనిపోయి ఉంది. కూతురు ఎందుకు ఆత్మహత్య చేసుకుందో తెలియదని తనకు తన భర్తతో పాటు ఆయన మొదటి భార్య కొడుకులపై అనుమానం ఉందని విచారణ జరిపి చర్య తీసుకోవాలని మృతురాలు తల్లి బత్తుల అరుణ పిర్యాదు చేయడం జరిగింది. మృతురాలు తల్లి బత్తుల అరుణ పిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేష్ తెలిపారు.



బత్తుల జ్యోష్ణ ( ఫైల్ ఫోటో )